# సీతతల్లి

'ఆ వీధినా! ఆ వీధిని నేను రాను-' అని పట్టుపట్టి, ప్రక్క త్రోవల తీసుకొని వెళ్ళాడు వెంకట్రావు. కారణమేమిటని ప్రాణం తియ్యగా తియ్యగా, సిగ్గు దిగమింగి, ఒకరోజు యిద్దరం పడుకున్న తరువాత, చీకట్లో చెప్పాడు.

'మేడమీద కిటికీలో ఆ అమ్మాయిని చూచిన నాటినుండి సరదా కలిగిన రోజూ ఐదారుసార్లు ఆ దోవనే తిరుగుతో వుండేవాణ్ణి, రెండో రోజున కొంచెంగా నవ్వి, నా అశల్ని మొలకెత్తించింది. కానీ నాలుగో రోజు నుంచి కింద గుమ్మంలో వాళ్ల తల్లిలాగుండే ఒక ఆమె నుంచుని, పైకి చూసే నా వంక, కోపంతో చూస్తో వుండడం కనిపెట్టాను. కానీ ఆడదానికి బయపడతానా నేను అనుకొని, మళ్ళీ మళ్ళీ వెడుతున్నాను. రోడ్డు మీద నడిచే నన్ను ఎవరేమంటారు? కిటికీలో కూర్చున్న ఆ అమ్మాయి తల్లో గులాబి పువ్వులు చంపలకి అందమిచ్చాయి. ఒకసారి పైకి చూసి తలొంచుకుని వెళ్ళిపోతున్నాను.

'అబ్బాయీ! మాట, యిట్టారా' అంది తల్లి గుమ్మంలోంచి.

దులిపేసుకుని పారిపోయి, యింక ఆ వీధిని రాకూడదని, అనుకున్నాను. కాని ఆడదానికి భయపడతానా, అనిపించింది. ఐనా యెందుకు పిలుస్తోందో! కంఠంలో కోపం వినపట్టం లేదు. పలక్క వెడితే తప్పు పని చేసినట్టుటుందని. నేనేం చేశానని, తప్పు పట్టటానికి? గుమ్మంలోకి వెళ్ళి....

"ఎందుకు?" అన్నాను.

"ఇట్లారా! చెపుతా."

కోపంలేదు, వెడితే నేం?

లోపలికి వెళ్ళాను.

"ఇదిగో చూడు! చిన్నవాడివి. వృద్ధిలోకి రావలసినవాడివి. ఇల్లాంటి పనులు నీకూ, నీ కుటుంబం మర్యాదకీ తగినవి కావు."

"ఏం చేశాను?" అనపోయినాను కానీ, ఆమె తిడుతోవుంటే వినడం బాగుంది. కోపం లేదు ఆమె చక్కని కళ్ళల్లో.

"నీకు పెళ్ళయిందా?"

"లేదు."

"నీకు చెల్లెళ్ళున్నారా?"

"ముగ్గురున్నారు."

"వాళ్ళకోసం యెవరన్నా వీధి వెంబడి యిట్లా తిరుగుతూ వుంటే నీకెట్లా వుంటుంది?"

"చాలా తమాషాగా వుంటుంది."

"మంచివాడివే. మా అమ్మాయి నీ చెల్లెలాంటి పిల్లకదూ. అట్లా అల్లరి చేస్తావా దాన్ని!"

"నేనేం అల్లరి చెయ్యలేదు."

"ఊరికే బూకరించకు. నేను చూస్తోనే వున్నాను. ఇట్లాంటి పనులు మానెయ్యి ఇక్కడే కాదు. ఎక్కడాను. నీకోసం, నువ్వు బాగుపడాలనే చెపుతున్నాను. మా అమ్మాయికేమీ నష్టం లేదు. ఇట్లా చూడు, ఇల్లాంటి చక్కని మొహాన్ని కళ్ళనీ, నీ భార్య కోసం దాచుకో అందరికీ ఇట్లా పంచేస్తే యాడవదూ!... సరే కాని యెక్కడ చదువుకుంటున్నావు?"

"హైస్కూలులో"

"ఏ క్లాసు?"

"స్కూలు ఫైనలు"

"ఇంకేం! వూరికే అల్లరి చెయ్యకపోతే, రోజూ వొచ్చి మా అమ్మాయికి ఇంగ్లీషు చెప్పరాదూ?"

నా వొళ్ళు పరవశమయింది.

సీతకి ఇంగ్లీషు రాదు. చెప్పినా రాదు. ఊరికే పిచ్చిగా మొహం వంక చూస్తూ కూచుంటుంది. ఆ అమ్మాయికోసం నేను పడ్డ ఉత్సాహం ఇంగ్లీషు చెప్పడంలో సగం పోయింది. కాని సీత అందమైన పిల్ల చూపులతో చాలా అల్లరి చెయ్యగలదు. ఆ తల్లి మాత్రం రోజూ పాఠం చెప్పినంతసేపూ మాతో కూచుంటుంది. కనక పుస్తకం మీదినించి సీత నాకేసి కింది చూపులెన్ని చూసినా, నేను ఆ అమ్మాయి పాదాల్నెంత నొక్కినా ఏం లాభం లేకపోయింది. ఇంగ్లీషులో తల్లికి తెలీకుండా మాట్లాడదామంటే సీతకి అంతా కలిపి పదిహేను యింగ్లీషు మాటలొచ్చు - బల్లా, చాపా, పిల్లీ మొదలైనవాటికి, ఇంక ఆ ప్రైవేటు మానెయ్యాలనుకుంటున్నాను. ఆలోచించి ఒక చీటీ రాశాను సీతకి. పుస్తకంలో పెట్టాను. ఆ రాత్రి అన్నం తొరగా తిని మేడ మెట్లమీద నుంచోమని చదువైన తరువాత బైటికి వెళ్ళి ఒక అరగంట తిరిగి వెనక్కి వొచ్చి సరాసరి మెట్లెక్కుతున్నా. వొంటింటిలోంచి మాటలు వినబడుతున్నాయి. మెట్ల మీద నల్లచీరె చెరుగు కనపడ్డది. గుండెలు కొట్టుకుంటో మెట్లెక్కలేకపోయినాను. దీపం బాగా కనపట్టం లేదు. దగ్గిరికి వెళ్ళి భుజం మీద చెయ్యేశాను. సీతతల్లి! చప్పున నా చెయ్యి పట్టుకొని దగ్గిరకు లాగి,

"ఏమిటిది బాబు! ఇదేం పని! మంచివాడవే!"

ఇంకా యేమిటో చెప్పబోతోంది. భయంతో పరిగెత్తుకుని వచ్చేశాను.

మర్నాడు వెళ్ళ సాహసించలేదు. కాని కబురు వొచ్చింది. రాత్రి ఏమీ జరగనట్టే ప్రవర్తించింది ఆమె. పదిరోజులయిం తరవాత ఒకరోజు సాయంత్రం నేను వెళ్ళేప్పటికి తల్లీ కూతురూ యెవరూ ఇంట్లో లేరు. ఒక గంట కూచున్నాను. ఈ ట్యూషన్ నాకు విసుగు పుడుతోంది. ఆవిడట్లా కావిలి కూచునివుంటే, యేం లాభం? అప్పుడే వుదయించే వెన్నెల తరిమిన నల్లని ఆకాశపు చిరునవ్వు కాంతితో నిండిన పొలాల్ని చూసి, చూసి విసుగు పుట్టింది. సీతను వొంటిగా కలుసుకోవాలి!

చీకటి పడ్డది. దీపాలెవరూ వెలిగించలేదు. బండి వాకిట్లో ఆగింది. సీత పైకి వచ్చింది. గంధం, దవనము పరిమళాలు నన్ను కమ్మాయి. చీకట్లో వెనకనే వెళ్ళి నుంచున్నాను. బీరువాలోంచి తీసిన పట్టుచీర వాసన వేసింది. మెడమీద ముత్యాల హారం, దానిమీద వొదులుగా అల్లిన జడా కనబడ్డాయి.

"సీతా!"

చప్పున తిరిగి చూసింది.

ఇంతలో కిందనించి

"బాబు వొచ్చాడా?" అంది తల్లి.

నా ప్రయత్నమంతా విఫలమయింది.

"లేదు" అంది సీత.

ఆశ్చర్యపడిపోయినాను. ఆ 'లేదు' అన్న వొక్క మాటకే సీతకి దాస్యం చెయ్యొచ్చు! నెల రోజులు చెప్పినా ఇంగ్లీషులో వర్తమాన కాలానికీ, భూతకాలానికీ భేదం తెలీని సీత, యీ విషయంలో ఎంత వివేకం చూపిందో! రెండు చేతులు జాచి సీతని దగ్గిరికి తీసుకున్నాను. ఆ పల్చని పట్టుచీరెలోంచి గట్టి చిన్న.... నన్నానుకుంది. నా వేళ్ళ కింద ఆమె లేత దేహం ఝల్లు ఝల్లుమని వొణికాము. చీకట్లో తిప్పేసుకునే ఆమె పెదమల్ని వెతికాను. అట్లా నుంచున్నాయి, ఎంతోసేపు కదలడానికి భయపడుతో! మెల్లిగా సోఫామీద అట్లానే వొరిగాము. ఎంతోసేపయింది. గట్టిగా నన్ను ఆమె చేతులు వత్తాయి. నా వొళ్ళు బాధతో లాక్కుపోయింది. ఇంతలో మెల్లిగా దీపం వెలుతురు పడ్డది. సీత తల్లి యెదురుగా నుంచుంది.

"ఏమిటిది! ఆ!..."

మేం మాట్లాడక విడిగా నుంచున్నాము. సీత చాలా భయపడి వొణకడమో లేక యాడవడమో చేస్తుందనుకున్నాను.

"నువ్వు పో!" అంది సీతని, ఆమె తల్లి.

మామూలుగా పక్కకి తిరిగి వెళ్ళిపోయింది.

"ఏం చేస్తున్నావు? ఇందుకా నిన్నిట్లా నమ్మింది? చిన్నదాన్ని చేసి.... మంచివాడవనుకుని.... ఇదా నాకు చేసే వుపకారం? సిగ్గుగాలేదూ?"

ఏం చేస్తుంది? కొడుతుందా? నేను మళ్ళీ కొట్టలేనూ? ఆమె చేతులకేసి చూశాను. గుండ్రంగా పెద్దవిగా చల్లగా...

"నాక్కోపం వచ్చింది నీ మీద, ఏం చెయ్యనూ? ఇట్లాంటి బుగ్గల్ని...." అంటూ.

దగ్గిరకి వొచ్చి నా బుగ్గలు కఠినంగా నొక్కింది.

"ఇంకెప్పుడూ యిట్లా చెయ్యనను."

నిరాశ పొందిన నా నరాలు వూరికి తహతహలాడుతున్నాయి. ఇంకా అనుభవానికై వెతుకుతున్నాయి.

"చెయ్యనన్న దాకా నిన్ను వదలను."

నా చెయ్యి పట్టుకుంది. దగ్గిరగా నుంచుని ఆమె వూపిరి నా తల మీద తగుల్తోంది. గాఢంగా లాగే ఆమె విశ్వాసం నాకు వినపడుతోంది.

"ఏం, మాట్లాడవేం?"

నా మొహం దగ్గిరగా ఆమె వెచ్చని రొమ్ము కుమ్మేస్తోంది.

"అయితే వెళ్ళనీను, యింతే."

ఆమె రాసుకున్న మొగలి అగరువాసన నా తల తిప్పింది.

"ఇంతే నిన్ను."

గట్టిగా కావలించుకుంది. నా చేతులతో ఆమె చేతుల్ని పైన పట్టుకున్నాను.

* * *

సిత తల్లి, సీతకన్నా బావుంది. కానీ మళ్ళీ వెళ్ళడమంటే భయంగా వుంది. ఎందుకంటే ... యింక చెప్పను.

◆ ◆ ◆

*రచనాకాలం : 1928*

*ప్రచురణ : (చలంగారి కలం - స్టేషనుపంపు) ఎమెస్కో ప్రచురణ*